# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- లోహ్రీ, మకర సంక్రాంతి, పొంగల్, మాఘ్ బిహు పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం త్వరలోనే అవతరిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.
- బ్రిక్స్ దేశాలను కలుపుకొని ప్రపంచ సంక్షేమానికి భారత్ కృషి చేస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ఆపరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు.

======================

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ప్రజలు ఈ రోజు నుంచి లోహ్రీ, మకర సంక్రాంతి, పొంగల్, మాఘ్ బిహు పండుగలను జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు దేశ వ్యవసాయ సంప్రదాయాలకు ప్రతీకలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని తన సందేశంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టడానికి అవిశ్రాంతంగా శ్రమించే రైతుల కష్టానికి, అంకితభావానికి ఈ పండుగలు నిదర్శనమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో జరుపుకునే ఈ పండుగలు ప్రకృతి పట్ల మానవుల కృతజ్ఞతను తెలియజేస్తాయని రాష్ట్రపతి తెలిపారు.

======================

ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం త్వరలోనే అవతరిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. గాంధీనగర్ జిల్లాలోని తన స్వస్థలమైన మానసాలో 267 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ఈరోజు ప్రారంభించి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ... సోమనాథ్ ఆలయాన్ని దేశ ఆత్మగౌరవానికి ప్రతీకగా అభివర్ణించారు. ఈ ఆలయం సుదీర్ఘమైన

చరిత్రను చాటి చెప్పడానికి, ఆత్మగౌరవ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి కేంద్రప్రభుత్వం ఏడాది పొడవునా "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్"ను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడలకు కొత్త ప్రపంచ కేంద్రంగా అహ్మదాబాద్ ఆవిర్భవిస్తోందని ఆయన చెప్పారు. 2036 ఒలింపిక్ క్రీడలను ఈ నగరంలో నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

అన్ని దేశాలను కలుపుకొని ప్రపంచ సంక్షేమానికి భారత్ కృషి చేస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చెప్పారు. ఈ ఏడాది బ్రిక్స్ కూటమికి భారత్ సారధ్యం వహిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా పరస్పర సహకారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం, బ్రిక్స్ – 2026 లోగో, అధికారిక వెబ్‌సైట్‌ను న్యూఢిల్లీలో ఆయన ఈ రోజు ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... 2026 సంవత్సరం నాటికి బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 సంవత్సరాలు గడిచాయని చెప్పారు. గత రెండు దశాబ్దాల కాలంలో బ్రిక్స్ కూటమి అజెండా, సభ్యత్వాలు గణనీయంగా పెరిగాయని గుర్తు చేశారు. ఐక్యతా భావనతో ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేలా కూటమి దేశాలను సమాయత్తం చేస్తామని ఈ సందర్భంగా జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలని సుప్రీం కోర్టు  కోరింది. ఈ వ్యవహారంపై ఈ రోజు విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వ్యక్తులు, సంస్థల తీరుని ప్రశ్నించింది. కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. కుక్కల దాడిలో చిన్నారులు మరణిస్తే ఎవరిని బాధ్యుల్ని చేయాలని ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా సంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలో వీధి కుక్కలు సంచరించకుండా  వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది.

విరామం

======================

ఆపరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలు చేశామని తెలిపారు. 88 గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో భారత సైనిక దళాలు అత్యంత సమర్ధంగా పని చేశాయని పేర్కొన్నారు. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయడంతో పాటు ఉగ్రవాదులను హతమార్చామని తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయని ఉపేంద్ర ద్వివేది వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

======================

వికసిత్ భారత్ జి-రామ్-జి చట్టం దేశంలోని గ్రామీణ కుటుంబాలకు మేలు చేస్తుందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఈ చట్టం ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ కుటుంబానికి గతంలో ఉన్న 100 రోజుల పనిదినాలకు బదులుగా 125 రోజుల వేతన ఉపాధికి హామీ లభిస్తుందని చెప్పారు. డిజిటలైజేషన్ వల్ల ఈ పథకం కింద నకిలీ లబ్ధిదారులను అరికట్టవచ్చని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఈ విషయంలో పూర్తి అవగాహనతో వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో మాదకద్రవ్య రహిత క్యాంపస్ ప్రచారాన్ని ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ఈ రోజు ప్రసంగిస్తూ... వ్యసనాలకు దూరంగా ఉంటూ, యువత ఆరోగ్యంగా ఉండాలని.. అప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాలు సాకారం అవుతాయని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఉప రాష్ట్రపతి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సాయుధ దళాలలో పని చేయడం ఒక వృత్తి కాదని దేశానికి సేవతో పాటు, త్యాగాలకు జీవితాంతం కట్టుబడి ఉండటమేనని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన నేషనల్ క్యాడెట్స్ కార్ప్స్ (NCC) రిపబ్లిక్ డే క్యాంప్-2026ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జాతీయవాదం అనే అంశంపై మాట్లాడుతూ.. సాయుధ దళాలలో విధి నిర్వహణ అన్నది అత్యంత గొప్ప గౌరవనీయమైన వృత్తులలో ఒకటిగా అభివర్ణించారు. సురక్షితమైన భారతదేశాన్ని రూపొందించడంలో దేశ యువత చురుకైన భాగస్వామ్యం కలిగి ఉండాలని ఆయన చెప్పారు. జాతీయ విలువలు, నిబద్ధతతో కూడిన మార్గాన్ని ఎంచుకోవడం ద్వారానే NCC క్యాడెట్‌లు జాతీయ అభివృద్ధికి దోహదపడగలరని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలంలో ఉన్న దీపిక స్వగ్రామం తంబలహట్టిని పోస్టల్ అధికారులు సందర్శించి ఆమెకు రాష్ట్రపతి తరఫున ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. భారత రాష్ట్రపతి నుండి ఆహ్వానం అందుకోవడం తనకు గర్వకారణమని దీపిక ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనుండటం ఒక మరపురాని అనుభూతి అని, ఇది తనకు గొప్ప గౌరవమని దీపిక అభివర్ణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, హర్యానా, చండీగఢ్ పంజాబ్‌లలో దట్టమైన పొగమంచు పరిస్థితుల నేపథ్యంలో ఎరుపు రంగు హెచ్చరికలను భారత వాతావరణ విభాగం (IMD) జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలలో చలిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, చండీగఢ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో ఈ నెల 17 వరకూ దట్టమైన పొగమంచు పరిస్థితి ఉండే అవకాశం ఉందని IMD వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =